TGTEL/25/A4812

# వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 33 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ మంగళవారం | మే 12, 2026




2లో..

## జూన్ 2 నుంచి రెండో విడత 'ఇందిరమ్మ ఇళ్లు'

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఆదిలాబాద్‌లో ప్రారంభించనున్న ప్రభుత్వం
- 21న కేబినెట్ భేటీలో విధివిధానాల ఖరారు
- పెండింగ్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీకి 'స్పెషల్ డ్రైవ్'

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీని ఘనంగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్ జిల్లాలో లాంఛనంగా ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. మంగళవారం హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు.

## లక్షలాది మంది విద్యార్థుల కలలు కల్లలు

- నీట్ రద్దుపై రాహుల్ గాంధీ ఆగ్రహం
- బీజేపీ పాలనలో యువత భవిష్యత్తు ఛిద్రం
- అమృత కాలం కాదిది.. యువతకు 'విష కాలం'
- పేపర్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



## అసోం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారం

- వరుసగా రెండోసారి పగ్గాలు చేపట్టిన భాజపా నేత
- ప్రధాని మోదీ, అమిత్ షా సమక్షంలో అట్టహాసంగా వేడుక
- హాజరైన ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్

2లో..




## పోక్సో కేసులో కుల ప్రసక్తి ఉండదు

- మహేశ్ కుమార్ గౌడ్
- మంత్రి పొన్నం వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం..
- ప్రభుత్వానికి సంబంధం లేదు
- చట్టం అందరికీ ఒకేలా ఉంటుంది..
- బాధితురాలికి అండగా ఉంటాం
- బీజేపీ 'నారీ శక్తి' నినాదాలు ఏమయ్యాయి? అని నిలదీసిన పీసీసీ చీఫ్

2లో..



- కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి
- 69 రోజులకు సరిపడా క్రూడాయిల్ నిల్వలు సిద్ధం
- ఎల్‌పీజీ ఉత్పత్తిని భారీగా పెంచిన కేంద్రం
- పశ్చిమాసియా సంక్షోభంపై ఆందోళన అవసరం లేదని వెల్లడి



3లో..

## దేశంలో పుష్కలంగా ఇంధన నిల్వలు

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
మంగళవారం, మే 12, 2026

# పోక్సో కేసులో కుల ప్రసక్తి ఉండదు

- మంత్రి పొన్నం వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం..
- ప్రభుత్వానికి సంబంధం లేదు
- చట్టం అందరికీ ఒకేలా ఉంటుంది..
- బాధితురాలికి అండగా ఉంటాం
- బీజేపీ 'నారీ శక్తి' నినాదాలు ఏమయ్యాయి? అని నిలదీసిన పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు వ్యవహారంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కీలక స్పష్టతనిచ్చారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ కేసుపై మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆయన వ్యక్తిగతమని, వాటితో కాంగ్రెస్ పార్టీకి గానీ, ప్రభుత్వానికి గానీ ఎటువంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. కుల సంఘాల మధ్యవర్తిత్వం లేదా వివాహం ద్వారా ఈ కేసును పరిష్కరించుకోవచ్చన్న పొన్నం సూచనను మహేశ్ గౌడ్ ఖండించారు. "మైనర్లపై జరిగే నేరాల విషయంలో చట్టం చాలా కఠినంగా ఉంటుంది. నేర పరిశోధనలో నిందితుడి కులం, సామాజిక హోదా లేదా రాజకీయ పలుకుబడికి తావు లేదు. పోక్సో చట్టం ప్రకారం నిందితులకు శిక్షలు తప్పవు" అని ఆయన హెచ్చరించారు. బండి సంజయ్ ఈ కేసులో కుల రాజకీయాలను తీసుకురావడం దురదృష్టకరమని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఒక బాలికపై దాడి జరిగినప్పుడు 'నారీ శక్తి' అని నినాదాలు చేసే బీజేపీ నాయకులు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఈ కేసులో ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయాల్సిన అవసరం కాంగ్రెస్ పార్టీకి లేదని, కేవలం బాధితురాలికి న్యాయం జరగడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులను భగీరథ్ బెదిరిస్తున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం ఇప్పటికే దృష్టి సారించిందని పీసీసీ చీఫ్ తెలిపారు. ఆ ఆరోపణలు నిజమని తేలితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా, పారదర్శకంగా విచారణ జరుగుతుందని, నిందితుడు ఎంతటి శక్తివంతుడైనా సరే బాధితురాలికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

# జూన్ 2 నుంచి రెండో విడత 'ఇందిరమ్మ ఇళ్లు'

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఆదిలాబాద్‌లో ప్రారంభించనున్న ప్రభుత్వం
- 21న కేబినెట్ భేటీలో విధివిధానాల ఖరారు
- పెండింగ్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీకి 'స్పెషల్ డ్రైవ్'
- నియోజకవర్గమే యూనిట్‌గా స్థలాల గుర్తింపు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీని ఘనంగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్ జిల్లాలో లాంఛనంగా ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. మంగళవారం హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల ప్రజాప్రతినిధులు,




ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. రెండో విడత పథకానికి సంబంధించిన పూర్తి స్థాయి విధివిధానాలను ఈ నెల 21న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఖరారు చేస్తామని మంత్రి తెలిపారు. పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడమే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో పెండింగ్‌లో ఉన్న వాటిని అర్హులైన లబ్ధిదారులకు అందజేయడానికి యుద్ధప్రాతిపదికన 'స్పెషల్ డ్రైవ్' నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరులోపు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ పూర్తి కావాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా లబ్ధిదారులు నివసించే ప్రాంతానికి 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇళ్లు కేటాయించాలి. గతంలో నగరం నుంచి 20–30 కి.మీ దూరంలో ఇళ్లు ఇవ్వడం వల్ల లబ్ధిదారులు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదని, ఆ తప్పు పునరావృతం కాకూడదని హెచ్చరించారు. పూర్తిస్థాయిలో మౌలిక వసతులైన నీరు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యాలు కల్పించిన తర్వాతే గృహ ప్రవేశాలు చేయించాలన్నారు.



**ప్రభుత్వ భూముల పరిరక్షణపై కఠినం..**

ప్రభుత్వ భూమి అంగుళం అన్యాక్రాంతమైనా సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. మల్కాజిగిరిలో కోర్టు పరిధిలో ఉన్న భూముల రిజిస్ట్రేషన్ అంశంపై స్పందిస్తూ, బాధ్యులైన సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ప్రభుత్వ స్థలాలు, ముంపు ప్రాంతాలు, మురికివాడలు, భూదాన్ భూములను గుర్తించాలి. హైదరాబాద్‌లో సొంత స్థలం ఉండి అర్హులైన వారికి ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించాలి. రాజీవ్ గృహకల్ప, వాంబే, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలను జిల్లా హౌసింగ్ అధికారులు (PDs) సందర్శించి నివేదికలు ఇవ్వాలని కోరారు. అలాగే, సొంత భవనాలు లేని ఆర్‌డీవో, తహశీల్దార్ కార్యాలయాలకు నిధులు మంజూరు చేస్తామని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అసోం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారం

- వరుసగా రెండోసారి పగ్గాలు చేపట్టిన భాజపా నేత
- ప్రధాని మోదీ, అమిత్ షా సమక్షంలో అట్టహాసంగా వేడుక
- హాజరైన ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్





**గౌహతి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ మంగళవారం రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలో వరుసగా రెండోసారి సీఎం పదవిని చేపట్టిన తొలి బీజేపీ నేతగా ఆయన రికార్డు సృష్టించారు. గువాహటిలోని వెటర్నరీ కాలేజీ ఫీల్డ్‌లో ఉదయం 11:40 గంటలకు జరిగిన ఈ అట్టహాస కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు.

**◆ హాజరైన ఎన్డీయే అగ్రనేతలు**

ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ నేతలు సహా పలువురు కేంద్ర మంత్రులు విచ్చేశారు. ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో పాటు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు హాజరై హిమంతకు శుభాకాంక్షలు తెలిపారు.

**◆ కొత్త మంత్రివర్గం కొలువు**

హిమంత బిశ్వ శర్మతో పాటు మరో నలుగురు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో బీజేపీ నుంచి రామేశ్వర్ తేలి, అజంతా నియోగ్ ఉండగా.. ఏజీపీ నుంచి అతుల్ బోరా, బీపీఎఫ్ నుంచి చరణ్ బోరో బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి, సుసంపన్నమైన అస్సాం నిర్మాణానికి తమ ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుందని ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు.


**◆ ఘన విజయం - క్లీన్ స్వీప్**

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమి (ఎన్డీయే) అఖండ విజయం సాధించింది. మొత్తం 126 స్థానాలకు గాను ఎన్డీయే 102 సీట్లు గెలుచుకుంది. ఇందులో బీజేపీ ఒక్కటే 82 సీట్లు సాధించి రికార్డు సృష్టించగా, మిత్రపక్షాలైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 స్థానాలను దక్కించుకున్నాయి. ప్రతిపక్ష కాంగ్రెస్ కూటమి కేవలం 19 సీట్లకే పరిమితమైంది.

**◆ కలకలం రేపిన తూటాల లభ్యత**

వీవీఐపీలు హాజరైన ఈ కార్యక్రమం వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా అతని వద్ద తూటాలు లభ్యమవ్వడం కలకలం రేపింది. పోలీసులు వెంటనే నిందితుడిని బసిస్ట్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. భారీ భద్రతా వలయం మధ్య ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది.





వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
మంగళవారం, మే 12, 2026

# 1.4 కేజీల చిన్నారికి పునర్జన్మ

- పద్మావతి ఆసుపత్రి వైద్యుల అద్భుత చికిత్స
- 14 రోజుల పోరాటం తర్వాత క్షేమంగా డిశ్చార్జ్

**వేములవాడ, వరంగల్ వాయిస్:** నెలలు నిండకముందే అత్యంత తక్కువ బరువుతో జన్మించిన ఓ పసికందును వేములవాడలోని పద్మావతి తల్లి, పిల్లల ఆసుపత్రి వైద్యులు మృత్యుంజయుడిగా తీర్చిదిద్దారు. చావుబతుకుల మధ్య ఉన్న శిశువుకు అత్యాధునిక వైద్యం అందించి ప్రాణాపాయం నుంచి తప్పించారు. నల్గొండ జిల్లాకు చెందిన లింగంపల్లి పుష్పలత–భరత్ దంపతులు గర్భధారణ సమయంలో పద్మావతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పుష్పలతకు ఎనిమిదో నెల పూర్తికాకముందే పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ తేజస్విని పర్యవేక్షణలో ఆమెకు సాధారణ ప్రసవం జరగ్గా, కేవలం 1.4 కేజీల అత్యల్ప బరువుతో మగ శిశువు జన్మించాడు.

### ◆ ఎన్ఐసీయూలో 14 రోజుల పోరాటం:

శిశువు ఆరోగ్య పరిస్థితి క్లిష్టంగా ఉండటంతో చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో వెంటనే ఎన్ఐసీయూ విభాగంలో చేర్చారు. ఊపిరితిత్తుల సమస్య, జాండిస్, సెప్సిస్ వంటి తీవ్రమైన ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొంటున్న శిశువుకు నాలుగు రోజుల పాటు నాన్–ఇన్వేసివ్ వెంటిలేషన్ ద్వారా శ్వాస అందిస్తూ ప్రత్యేక వైద్యం అందించారు. వైద్యుల నిరంతర పర్యవేక్షణలో 14 రోజుల తర్వాత బాబు పూర్తి ఆరోగ్యవంతుడు కావడంతో మంగళవారం ఆసుపత్రి నుంచి



డిశ్చార్జ్ చేశారు.

### ◆ అందుబాటులో కార్పొరేట్ వైద్యం:

ఈ సందర్భంగా డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ.. ప్రీమెచ్యూర్ (నెలలు నిండకుండా పుట్టిన) శిశువులకు సర్ఫాక్టెంట్, సీపాప్ వంటి అత్యాధునిక సౌకర్యాలతో మెరుగైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ.. సామాన్యులకు భారం కాకుండా తక్కువ ఖర్చుతోనే కార్పొరేట్ స్థాయి సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. వేములవాడ పరిసర ప్రాంతాల్లోనే అత్యాధునిక ఎన్ఐసీయూ ఉండటం వల్ల అత్యవసర సమయంలో శిశువుల ప్రాణాలను కాపాడగలుగుతున్నామని ఆసుపత్రి నిర్వాహకులు రాజేష్ తెలిపారు. తమ బిడ్డకు పునర్జన్మ ప్రసాదించిన వైద్య బృందానికి బాబు తండ్రి భరత్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఏకాగ్రతకు, మానసిక వికాసానికి యోగా ప్రాధాన్యం

- ప్రిన్సిపల్ కే. గోపాల్

**అమ్రాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా అమ్రాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మంగళవారం రెండో రోజు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ కే. గోపాల్ అధ్యక్షతన 'యోగ – దాని ప్రాముఖ్యత'పై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కే. గోపాల్ మాట్లాడుతూ.. యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదని, అది వ్యక్తి యొక్క మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే తాము ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోగలరని తెలిపారు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు యోగాసనాలు, ప్రాణాయామం చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని, తద్వారా పోటీ పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడవచ్చని ఆయన ఆకాంక్షించారు. అనంతరం కళాశాల అడ్మిషన్ల గురించి మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన చుట్టుపక్కల గ్రామాల్లోని విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేలా అవగాహన కల్పించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం డాక్టర్



కే.రాధ, ఏ.చంద్రయ్య, జి.ఆంజనేయులు, బి.రమేష్, అధ్యాపకేతర సిబ్బంది మహమ్మద్ యూనిస్, ఎం.రామకృష్ణ, సి.రాఘవేందర్ రెడ్డి, టి.కృష్ణ, పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- ◆ జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- ◆ వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ
- ◆ రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశం

**వేములవాడ రూరల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించి, వారికి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశించారు. మంగళవారం ఆయన వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని కేసుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, దర్యాప్తులో జాప్యం చేయకుండా పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని అధికారులను ఆదేశించారు. అలాగే గంజాయి, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు తరచూ వాహనాల తనిఖీలు నిర్వహించి, ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు గ్రామాలను సందర్శిస్తూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ



పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని, వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ మరిన్ని కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా, హెల్మెట్ వినియోగం, మైనర్ డ్రైవింగ్ నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎస్పీ వెంట డిఎస్పీ శ్రీనివాసులు, సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ వెంకట్రాజం, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# పాల బిల్లుల కోసం పాడి రైతుల ఎదురుచూపులు

- రూ.కోటికి చేరిన బకాయిలు..
- 45 రోజులుగా అందని సొమ్ము
- అధికారులు స్పందించి ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి




**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అచ్చంపేట పరిధిలోని పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 45 రోజులుగా పాల బిల్లులు రాకపోవడంతో దాదాపు రూ. 1 కోటి మేర బకాయిలు పేరుకుపోయాయి. సాధారణంగా ప్రతి 15 రోజులకు ఒకసారి చెల్లించాల్సిన పాల బిల్లులు, నెలన్నర గడుస్తున్నా అందకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అచ్చంపేట పరిసర గ్రామాల నుంచి సుమారు 680 మంది పాడి రైతులు ప్రతిరోజు దాదాపు 6,500 లీటర్ల పాలను పట్టణంలోని పాల శీతలీకరణ కేంద్రానికి తరలిస్తున్నారు. పశువుల దాణా, నిర్వహణ ఖర్చులు పెరిగిపోవడంతో, బిల్లులు సకాలంలో రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి బకాయిలను విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ యాకన్న వివరణ కోరగా.. పాడి రైతులకు కోటి రూపాయల మేర బకాయిలు ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించారు. అయితే, ఒక విడతకు సంబంధించిన బిల్లు నేడు రైతుల ఖాతాల్లో జమ అవుతుందని ఆయన వెల్లడించారు. మిగిలిన బకాయిలను కూడా త్వరలోనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# దేశంలో పుష్కలంగా ఇంధన నిల్వలు

- కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి
- 69 రోజులకు సరిపడా క్రూడాయిల్ నిల్వలు సిద్ధం
- ఎల్‌పీజీ ఉత్పత్తిని భారీగా పెంచిన కేంద్రం
- పశ్చిమాసియా సంక్షోభంపై ఆందోళన అవసరం లేదని వెల్లడి

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశంలో ఇంధన సరఫరాకు ఎటువంటి ఆటంకాలు లేవని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి స్పష్టం చేశారు. మంగళవారం జరిగిన సీఐఐ వార్షిక వాణిజ్య సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఇంధన భద్రతపై దేశం పటిష్టమైన స్థితిలో ఉందని భరోసా ఇచ్చారు. భారతదేశం ప్రస్తుతం ఏ పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. ఇంధన నిల్వల గణాంకాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. క్రూడాయిల్, ఎల్ఎన్‌జీ: దేశంలో ప్రస్తుతం 69 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయి. ఎల్‌పీజీ (వంట గ్యాస్) 45 రోజులకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయి. పశ్చిమాసియా సంక్షోభం దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా ఎల్‌పీజీ ఉత్పత్తిని రోజుకు 35 వేల టన్నుల నుంచి 54 వేల టన్నులకు పెంచినట్లు మంత్రి వెల్లడించారు. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పడకుండా ఉండేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇప్పటికే తగిన దిశానిర్దేశం చేశారని మంత్రి పురి గుర్తు చేశారు. గత ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సదస్సులో ప్రధాని చేసిన సూచనలను ఆయన ప్రస్తావించారు . పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించి, మెట్రో రైళ్లు, కార్‌పూలింగ్ మరియు ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. దేశ ఆర్థిక సుస్థిరత కోసం ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు, అనవసర విదేశీ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలి. వీలైనంత వరకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానాన్ని ప్రోత్సహించాలని ప్రధాని కోరారు. దేశవ్యాప్తంగా ఇంధన సరఫరా గొలుసు స్థిరంగా ఉందని, ఎక్కడా ఎటువంటి కొరత లేదని మంత్రి పురి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
మంగళవారం, మే 12, 2026

## సనాతన ధర్మంపై మరోసారి ఉదయనిధి వివాదాస్పద వ్యాఖ్యలు

**చెన్నై, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తమిళనాడు మాజీ ఉప ముఖ్యమంత్రి, డీఎంకే అగ్రనేత ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై మరోసారి తన విద్వేషపూరిత వ్యాఖ్యలతో రాజకీయ దుమారం రేపారు. మూడేళ్ల క్రితం సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియా వంటి రోగాలతో పోల్చి దేశవ్యాప్తంగా విమర్శలు ఎదుర్కొన్న ఆయన, తాజాగా మంగళవారం తమిళనాడు అసెంబ్లీ వేదికగా మరోసారి అవే తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం. తమిళనాడు అసెంబ్లీ కొత్త స్పీకర్‌గా ఎన్నికైన జె.సి.డి. ప్రభాకర్‌ను అభినందించే క్రమంలో ఉదయనిధి ప్రసంగించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ.. 'సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి' అంటూ తన పాత వాదనను వినిపించారు. దేశవ్యాప్తంగా ఆయన వ్యాఖ్యలపై కోర్టుల్లో కేసులు నడుస్తున్నప్పటికీ, ఏమాత్రం తగ్గకుండా శాసనసభ సాక్షిగా ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉదయనిధి వ్యాఖ్యలపై తమిళనాడు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసన్ ఘాటుగా స్పందించారు. "ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలినా ఉదయనిధి తీరులో మార్పు రాలేదు" అని విమర్శించారు. డీఎంకే నిజంగా సనాతన ధర్మ నిర్మూలననే తమ సిద్ధాంతంగా భావిస్తే, దానిని ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు పెట్టలేదని ఆయన ప్రశ్నించారు. శ్రీనివాసన్ సంధించిన ప్రశ్నలు హిందూ మతాన్ని నిర్మూలించడమే డీఎంకే విధానమైతే మేనిఫెస్టోలో ఆ ప్రస్తావన ఎందుకు లేదు?, ఎన్నికల ప్రచార సమయంలో ఉదయనిధి ఈ అంశంపై ఎందుకు మౌనం వహించారు?, ప్రచారం చివరి రోజున 'మేము హిందువులకు వ్యతిరేకం కాదు' అని ముఖ్యమంత్రి స్టాలిన్ ఎందుకు ప్రకటించారు?. ఎన్నికల సమయంలో ఒకలా, గెలిచిన తర్వాత మరోలా మాట్లాడటం డీఎంకే ద్వంద్వ నీతికి నిదర్శనమని బీజేపీ మండిపడింది. ఈ తాజా వ్యాఖ్యలు తమిళనాడు రాజకీయాల్లో మళ్లీ అగ్గి రాజేసేలా కనిపిస్తున్నాయి.

## పోలీసు వాహనాల పాత విడిభాగాల వేలం




**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు వాహనాల పాత విడిభాగాలను ఈ నెల 15 శుక్రవారం రోజున వేలం వేయనున్నట్లు సీపీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ప్రభుత్వ పోలీస్ వాహనాలకు సంబంధించి రిపేర్ చేయబడిన బ్యాటరీలు, టైర్లు, విడిభాగాలను వేలంలో అందుబాటులో ఉంచుతామని, ఆసక్తి గల వ్యక్తులు శుక్రవారం ఉదయం 10 గంటలకు కమిషరేట్ కార్యాలయంలోని మోటర్ ట్రాన్స్పోర్ట్ ఆఫీస్ (యంటీవో)లో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాల కోసం 87126 85158, 9440242895,9949568320 నంబర్లకు సంప్రదించగలరని సీపీ తెలిపారు.

## బొట్టు, దుస్తులపై ఉన్న శ్రద్ధ.. పేపర్ లీకేజీలపై లేదా?

- నీట్ పేపర్ లీక్ ఘటనపై కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డ విద్యార్థి సంఘం
- లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు..



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'నీట్' పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కావడంపై మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పరీక్షను సక్రమంగా నిర్వహించలేకపోవడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్ట అని ఎంఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మండిపడ్డారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తీరును విమర్శిస్తూ.. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులపై కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. "నిమిషం ఆలస్యమైనా అనుమతించని అధికారులు, విద్యార్థుల బొట్టు, దుస్తులు, చెప్పులు, జుట్టు క్లిప్‌ల వరకు తనిఖీ చేస్తూ వారిని మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారు. విద్యార్థుల బొట్టు మీద ఉన్న శ్రద్ధ అధికారులకు పేపర్ లీక్ మాఫియా మీద ఎందుకు లేదు?" అని ఆయన ప్రశ్నించారు. సమయపాలనపై కఠినంగా ఉండే వ్యవస్థ, ప్రశ్నాపత్రం బయటకు వెళ్తుంటే ఎందుకు చేతులెత్తేసిందని నిలదీశారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి, తల్లిదండ్రులు అప్పులు చేసి కోచింగ్ ఇప్పిస్తుంటే.. కొందరు డబ్బున్న మాఫియాలు పేపర్లను కొనుగోలు చేసి వ్యవస్థను అభాసుపాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పరీక్షను రద్దు చేసి మళ్ళీ నిర్వహిస్తామంటే సమస్య తీరదని, ఇప్పటికే విద్యార్థులు తీవ్ర మానసిక ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటల్ భద్రత గురించి గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం, విద్యార్థుల జీవితాలను కాపాడటంలో విఫలమైందని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ ఘటనపై పూర్తిస్థాయి పారదర్శక దర్యాప్తు జరపాలి. బాధ్యులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలి. పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకుని, పరీక్షా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలి. విద్యార్థుల హక్కుల కోసం, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం ఎంఎస్ఎఫ్ తరపున రాష్ట్రవ్యాప్త పోరాటాలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ఒత్తిడిని అధిగమించడమే నిజమైన మానసిక ఆరోగ్యం

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు




**మహాదేవపూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు 'యోగ, మానసిక ఆరోగ్యం' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెంటల్ హెల్త్ కన్వీనర్ వేముల రమేష్ ఆధ్వర్యంలో, కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డాక్టర్ వినయ్, డాక్టర్ నిఖిత ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వినయ్ మరియు డాక్టర్ నిఖిత మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో భావోద్వేగ సమతుల్యతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. కోపం, ఆందోళన, నిరాశ, ఒత్తిడి వంటి సమస్యలు ఎదురైనప్పుడు ఆవేశపడకుండా శాంతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. శారీరక ఆరోగ్యం బాగుంటేనే మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని వారు వెల్లడించారు. మానసిక ప్రశాంతత కోసం విద్యార్థులు పాటించాల్సిన పలు అంశాలను వారు వివరించారు. నిత్యం యోగా, ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వాడకాన్ని తగ్గించి, వ్యాయామంపై దృష్టి సారించాలి. కుటుంబ సభ్యులు, స్నేహితులతో మనసు విప్పి మాట్లాడటం ద్వారా ఒత్తిడి తగ్గుతుంది. మద్యపానం, మత్తు పదార్థాల వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. ప్రశాంతమైన ప్రకృతి వాతావరణంలో సమయం గడపడం ద్వారా భయం, నిద్రలేమి సమస్యలను అధిగమించవచ్చు. తీవ్రమైన మానసిక ఒత్తిడి ఎదురైనప్పుడు ఏమాత్రం సంకోచించకుండా నిపుణులైన కౌన్సిలర్ల సహాయం తీసుకోవాలని వారు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, అధిక సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## లక్షలాది మంది విద్యార్థుల కలలు కల్లలు

- నీట్ రద్దుపై రాహుల్ గాంధీ ఆగ్రహం
- బీజేపీ పాలనలో యువత భవిష్యత్తు చిధ్రం
- అమృత కాలం కాదిది.. యువతకు 'విష కాలం'
- పేపర్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఉదంతంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పేపర్ లీక్ కారణంగా పరీక్ష రద్దు కావడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదని, దేశ యువత భవిష్యత్తుపై జరుగుతున్న నేరమని అభివర్ణించారు. ఈ మేరకు మంగళవారం తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో రాహుల్ గాంధీ సుదీర్ఘ పోస్ట్ చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థుల కష్టాన్ని, వారి కుటుంబాల ఆశలను ఈ అవినీతి పాలన నాశనం చేసిందని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఎంతో మంది తండ్రులు అప్పులు చేసి, తల్లులు తమ నగలు అమ్మి పిల్లలను చదివించారు. విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి పరీక్షకు సిద్ధమయ్యారు. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో పేరుకుపోయిన అవినీతి వారికి శాపంలా మారాయి" అని ఆయన విమర్శించారు.

- **కష్టం కాదు.. కాసులదే రాజ్యమా?**

పరీక్షల నిర్వహణలో ప్రతిసారి పేపర్ మాఫియా సులువుగా తప్పించుకుంటోందని, నిజాయతీగా చదివే విద్యార్థులు మాత్రం శిక్ష అనుభవిస్తున్నారని రాహుల్ మండిపడ్డారు. "కష్టపడి చదవడం కంటే.. డబ్బు, పలుకుబడే భవిష్యత్తును నిర్ణయిస్తే ఇక విద్యకు అర్థమేముంది? ప్రధాని మోదీ చెప్పే 'అమృత కాలం' దేశ యువతకు 'విష కాలం'గా మారింది" అంటూ ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. విద్యా వ్యవస్థలో తక్షణమే పారదర్శకత తీసుకురావాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో కఠినమైన సంస్కరణలు చేపట్టాలని, పేపర్ లీకులకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించి, నష్టపోయిన విద్యార్థులకు సత్వరమే న్యాయం చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## గుడుంబా విక్రేతలకు పోలీసుల షాక్

- ముగ్గురు వ్యక్తుల బైండోవర్

**చిట్యాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండలంలో అక్రమ గుడుంబా విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. గతంలో ప్రభుత్వ నిషేధిత గుడుంబా విక్రయించిన ముగ్గురు వ్యక్తులను మంగళవారం చిట్యాల తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వసంత రావు ఎదుట బైండోవర్ చేసినట్లు చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ తెలిపారు. చిట్యాల గ్రామానికి చెందిన గుర్రపు కాలమ్మ, మొహమ్మద్ ఫాతిమా, ఉయ్యాల రమేష్ అనే వ్యక్తులు గతంలో గుడుంబా విక్రయించినట్లుగా గుర్తించారు. వీరిని తహసీల్దార్ ముందు హాజరుపరచగా, భవిష్యత్తులో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండేందుకు రూ.50,000 పూచీకత్తు లేదా 6 నెలల జైలు శిక్ష విధిస్తామని హెచ్చరిస్తూ తహసీల్దార్ బైండోవర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ గారు మాట్లాడుతూ కీలక హెచ్చరికలు జారీ చేశారు. మండలంలో ఎవరైనా గుడుంబా తయారీ చేసినా లేదా విక్రయించినా సహించేది లేదని, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే గుడుంబాను పూర్తిగా నిర్మూలించడమే తమ లక్ష్యమని, చిట్యాలను గుడుంబా రహిత మండలంగా మార్చేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే బాధ్యులపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

